క్లుప్తంగా

మానవపాడులో 22 మి.మీ. వర్షపాతం



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం కురిసిన వర్షం 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని గురువారం డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా తెలిపారు. గుంతలలో వర్షపు నీరు నిలిచింది. వాహనదారులకు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు గుంతలను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వర్షానికి కూలిన వృక్షాలు



ఉండవెల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మారమునగాల–2 వృక్షాలు విరిగి రోడ్ల పడ్డాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కుంటలు, గుంతలలో వర్షపు నీరు చేరుకుంది.

సరైన మార్గదర్శకాలు ఇవ్వాలి

రాజోళి: కులవృత్తుల వారికి ఆదుకునేందుకు ప్రభుత్వం ఇవ్వనున్న లక్ష రూపాయల పంపిణీకి సంబంధించిన దానికి సరైన మార్గదర్శకాలు ఇవ్వాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు జయన్న గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్తులకు ఈ పథకం వర్తిస్తుందో లేదో తెలియని అయోమయం స్థితిలో ఉన్నారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాలకు వెళితే అక్కడ గౌడ కులస్తులకు పథకం వర్తించదని చెబుతున్నారని పేర్కొన్నారు. గౌడ కులస్తులకు పథకం వర్తించేలా చేసి, సరైన మార్గదర్శకాలను విడుదల చేసి కులవృత్తులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దయ్య గౌడ్ పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో ప్రభుత్వం విఫలం

అయిజ: సాగునీటి సరఫరాలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ పార్టీ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడారు. ఆర్డీఎస్ కింద మల్లమ్మ కుంట, జూలకల్లు, వల్లూరు కుంటలను పూర్తి చేయకుండా చెరువు పండుగ ఉత్సవాలను నిర్వహించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఎస్పీ నాయకులు విజయ్ కుమార్, రాముడు, చిన్న, హనుమన్న, రవి, స్వామిదాస్, తిమ్మప్ప, తిరుపాల్, వెంకటేష్, నాగరాజు, సురేందర్, రాజు, విజయ్, బుడ్డన్న, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అయిజ: మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన కురువ రాముడు(32) అదృశ్యమైన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ రెండు నెలల కిందట భార్య పావనితో గొడువపడి కురువ రాముడు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో గురువారం అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



ధరూరు: ఈ నెల 12న గద్వాలలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్‌లు కోరారు. గురువారం మండలంలోని ర్యాలంపాడు మార్లబీడు, ఓబులోనిపల్లి, చెన్నారెడ్డి పల్లి, బూరెడ్డిపల్లి, మన్నాపురం గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులతో కలిసి వారు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కర పత్రాలను అందజేశారు. సీఎం సభకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, సర్పంచ్‌లు కర్రెమ్మ, సుజాత, మహబూబ్, పరుశరాముడు, నాయకులు శ్రీరాములు, తిమ్మప్ప, దర్శెల్లి, నాగన్న, రఫీ పాల్గొన్నారు.



గట్టు చెరువులో బతుకమ్మకు పూజలు చేస్తున్న సర్పంచ్



ఇటిక్యాలలోని తిమ్మాపురంలో చెరువు సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్రహం

అంబరాన్నంటిన సంబురం

అయిజ: పట్టణంలో చెరువు పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బతుకమ్మలతో ర్యాలీగా కొత్తచెరువు చేరుకున్నారు. చెరువుకట్టవద్ద కట్ట మైసమ్మ పూజ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలో చెరువ పండుగ సందర్భంగా గురువారం సర్పంచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నుంచి పెద్ద చెరువు వరకు బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. చెరువు పరిసరాల్లో భోజనాలను ఏర్పాటు చేశారు.

ధరూరు: మండలంలోని భీంపురంలో మహిళలు బతుకమ్మలు ఆడారు. పాఠశాల, కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ కార్యాలయాలకు తోరణాలు కట్టి చెరువు పండుగ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్, సర్పంచ్ పద్మమ్మ, ఉప సర్పంచ్ పాపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులలో మన ఊరు మన చెరువు పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం గ్రామస్తులు, మత్స్యకారులు సామాగ్రితో ర్యాలీ నిర్వహించి పూజలు చేశారు. కోలాటం, బతుకమ్మ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువుల దగ్గర గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు కలిసి సంబరాలను జరుపుకున్నారు. మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని ఊరేగింపు వచ్చి చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం ఎంపీపీ రాజారెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, ఎంపీడీఓ కృష్ణయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో చెరువులను బాగుచేసి కరువును దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురంలో ఏర్పాటు చేసిన ఊరూరా చెరువుల పండగకు ఆయన హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మలు ఆడి ర్యాలీగా చెరువు కట్ట దగ్గరికి చేరుకొని సంబరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరి, నాయకులు అజయ్, శివుడు, రాఘన్న, కార్యదర్శి చంద్రకళ, ఏఈఓ మౌనిక, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని బుక్కాపూర్, క్యాతూర్ గ్రామాల్లో చెరువు పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశంను పంచాయతీకి చేరుకుని, బొడ్డెమ్మలు వేస్తూ ర్యాలీగా చెరువు వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరావు, ఏడీఏ సక్రియానాయక్, ఇరిగేషన్ అధికారులు, ఏఈఓ సాయిరాం, సర్పంచ్‌లు మధుసూదన్ రెడ్డి, పల్లీ లలితమ్మ, ఎల్లమ్మ, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ధరూరులోని భీంపురంలో బతుకమ్మలతో..



గంగమ్మకు పూజ నిర్వహిస్తున్న ఎంపీడీఓ గోవిందరావు



అయిజలో బతుకమ్మలతో బయలుదేరుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరం



గట్టు: మండలంలోని మాచర్లలో గురువారం కంటి వెలుగు శిబిరం కొనసాగింది. మొత్తం 148 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 12 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 16 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సీహెచ్‌ఓ ఊసేని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయికిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



మల్దకల్: మండలంలోని అమరవాయి, బూడదపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసనను సీడీపీఓ కమలాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారికి విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ పద్మమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, కార్యకర్తలు యశోదమ్మ, తిమ్మమ్మ, పద్మమ్మ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ హామీని అమలు చేయాలి



మాట్లాడుతున్న రహ్మాన్

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన 12శాతం రిజర్వేషన్ హామీని వెంటనే అమలు చేయాలని వైఎస్సార్‌టీసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతికూర్ రహ్మాన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీ అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ముస్లింలకు రెసిడెన్సియల్ బాలుర పాఠశాల, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, మైనార్టీ రుణాలు, డబుల్ బెడ్రూంలు, జిల్లాకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలన్నారు. ఈనెల 12న గద్వాలకు రానున్న సీఎం కేసీఆర్‌కు ముస్లిం సమస్యలు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అతికూర్ రహ్మాన్, ఇసాక్, చాంద్‌పాషా, కౌసర్ బేగ్, రహిమతుల్లా, మక్బూల్, ఇబ్రహీం, జావీద్ తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు



శాంతినగర్: వానాకాలంలో పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులకు సంబంధించి గొంతువాపు, జొబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు శాంతినగర్ పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో వేశారు. గురువారం వడ్డేపల్లి మండలంలోని కొంకలలో 144 గేదెలు, 52 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం 23 మంది రైతులు లబ్ధిపొందారని తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ ఎండీ లతీఫ్, వీఏ ప్రభాకర్, గోపాలమిత్ర నారాయణగౌడ్‌లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

అయిజ: పట్టణంలోని పెద్ద ఆంజనేయ స్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన శివాలయంలో గురువారం శివలింగ ప్రతిష్ఠతోపాటు గణపతి, కుమార స్వామి, భవాని, నవగ్రహ, నాగ విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సావిర దేవర సంస్థాన మఠానికి చెందిన షట్‌బ్రహ్మ వీరభద్ర శివాచార్య మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ప్రాతకాల పూజలు, మూలమంత్ర అనుష్ఠానములు, దీక్షా, వాస్తు, రుద్ర, మన్యు, నారాయణ, రక్షా, శాంతి, ఆవాహిత దేవతా హోమాలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న వీరభద్ర శివాచార్య మహాస్వామి

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో మాల శ్రీనివాస్ కుటుంబానికి గురువారం స్నేహితులు రూ. 70 వేలు ఆర్థికసాయం అందజేశారు. మాల శ్రీనివాస్ హఠాన్మరణం చెందడం వలన తన చిన్ననాటి పాఠశాల స్నేహితులు అందరూ కలిసి రూ.70 వేలు జమచేసి బాధిత కుటుంబానికి చెక్కు రూపంలో అందించారు.



చెక్కు అందజేస్తున్న మిత్రులు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



గట్టు బీసీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం



ఎములోనిపల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గట్టు: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అందుతుందని హెచ్‌ఎం సురేష్ అన్నారు. గురువారం బడిబాటలో భాగంగా బీసీ కాలనీలో 5వ అంగన్‌వాడి టీచర్ సుజాతమ్మ, ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆట పాటల ద్వారా చదువుపై ఆసక్తి పెంచే విధంగా ప్రోత్సహిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటుగా మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ధరూరు: పిల్లలను పనులకు కాకుండా బడికి పంపించాలని చిన్నారుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. గురువారం బడిబాటలో భాగంగా మండలంలోని ఎములోనిపల్లి, పెద్దపాడు గ్రామాల్లో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎములోనిపల్లి సర్పంచ్ రామకృష్ణ, హెచ్‌ఎం కృష్ణవేణి, ఎస్ఎంసీ చైర్మన్ ఆంజనేయులు, టీచర్ సునీత, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి పాల్గొన్నారు.

మినీ డెయిరీ ఫాం ఏర్పాటుకు రుణాలు



చెక్కులను అందజేస్తున్న హెరిటేజ్ సిబ్బంది

రాజోళి: మినీ డెయిరీ ఫాం ఏర్పాటుకు రుణాలు అందజేస్తునట్లు మేనేజర్ సిరిసాల రాజు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం పాడి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు హెరిటేజ్ ద్వారా ప్రత్యేక రుణాలు ఇస్తుందన్నారు. అనంతరం బ్యాంక్ క్లస్టర్ హెడ్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్ బ్యాంకు ద్వారా రూ.50 వేలు నుంచి రూ.10 లక్షల వరకు రుణాల మంజూరు చేస్తున్నామని, మినీ డెయిరీ ఫాం ఏర్పాటు కోసం రూ.15 లక్షల వరకు రుణాలు అందచేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు మంజూరైన రూ.18 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాలేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, గజేందర్ రెడ్డి, మహేష్, నాగశేషులు, బీముడు, రాముడు పాపిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు కబ్జా చేసిన వ్యక్తిపై చర్య తీసుకోండి

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామం మీదుగా మద్దూరు వరకు ఉన్న లింకు రోడ్డును కబ్జా చేసిన రైతు సద్దల బాలకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురువారం కొంకన్‌వానిపల్లి సర్పంచ్ వెంకటన్నతో కలిసి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. కొన్నేళ్లుగా తమ గ్రామం నుంచి చిన్నచింతకుంట మండలం మద్దూరు గ్రామానికి రహదారి ఉందని సర్పంచ్ వెంకటన్న తెలిపారు. సద్దల బాలకృష్ణారెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న రోడ్డును జేసీబీతో పూడ్చి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రెండు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని, రహదారిని ఆక్రమించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారిని ఆక్రమించిన వ్యక్తి గురించి మద్దూరు సర్పంచ్‌కు విన్నవిస్తామని అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్‌కు రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



రహదారిని ఆక్రమించన ప్రదేశంలో ఆందోళన చేస్తున్న కొంకన్‌వానిపల్లి గ్రామస్తులు

పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని షాబాద్ నుంచి చాగాపురం వరకు రూ. కోటి ఐదు లక్షల వ్యయంతో రెండు కిలో మీటర్ల వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం పాటుపడుతున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను సన్మానించారు.

ప్రోత్సాహకం అందేనా..

- సర్పంచ్‌ల కష్టాలు తీరేనా..
- నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు
- ఏళ్లుగా నిధుల కోసం ఎదురుచూపు



పుటాన్‌దొడ్డిలో ఏకగ్రీవ సర్పంచ్‌కు నియామకపత్రం అందిస్తున్న అధికారులు(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామ పంచాయతీలను ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుంటే ప్రజల్లో ఐకమత్యం పెరిగి గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందించడం సులభమవుతుందని ప్రభుత్వాలు భావించాయి. దీని కోసం ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం అయ్యే పంచాయతీలకు ప్రత్యేక ప్రోత్సాహక నిధులను అందించాలని 2001లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ఆధారంగా ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 7లక్షల వరకు నిధులు మంజూరయ్యేవి. కానీ 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇట్టి ఏకగ్రీవ పోత్సహకాన్ని భారీగా పెంచింది. దీంతో గ్రామ అభివృద్ధి కోసం గ్రామస్తులంతా ఏకమై పలు పంచాయతీలను ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేశారు. కానీ ఏండ్లు గడిచినా నేటి వరకు ప్రోత్సాహక నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ నిధులతో పాటు అదనంగా..

ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు సాధారణ పంచాయతీలకు అందించే నిధులతో పాటుగా అదనంగా ప్రోత్సాహక నిధులను అందజేస్తారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక అదనంగా కొత్త పంచాయతీలు ఏర్పడటంతో పాటుగా రాష్ట్రంలో కొత్త పంచాయతీ చట్టం కూడా అమలులోకి వచ్చింది. దీని ద్వారా ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను పెంచింది. దీంతో పాత పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పడిన పంచాయతీలు సైతం అభివృద్ధిని ఆకాంక్షించి పలు పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నాయి. కానీ ఎన్నికలు జరిగి మూడున్నరేండ్లు గడుస్తున్నా నేటికి నిధులు మంజూరు కాకపోవడంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు.

ఆయా మండలాల వారీగా ఏకగ్రీవ గ్రామ పంచాయతీల వివరాలు.

మండలం	జీపీలు	ఏకగ్రీవ పంచాయతీలు
ఇటిక్యాల	29	పుటాన్‌దొడ్డి, తిమ్మాపురం, నక్కలపల్లి
మానవపాడు	16	కలుకుంట్ల
వడ్డేపల్లి	10	తిమ్మాజిపల్లి, వెంకట్రామనగర్
రాజోళి	11	పడమటి గార్లపాడు
ఉండవెల్లి	16	భైరాపురం
అలంపూర్	14	ఏకగ్రీవం కాలేదు
అయిజ	28	కురవపల్లి, గుడిదొడ్డి, కిష్టాపురం, నారోజీ క్యాంపు, కొత్తపల్లి

నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా మొత్తం 124 గ్రామ పంచాయతీలు కలవు. అందులో 13 పంచాయతీలు 2019 లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికలు లేకుండానే గ్రామ ప్రజల సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ. 15 లక్షల నజరానా ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలకు ముందు ప్రకటించింది. దీని ద్వారా నియోజకవర్గంలో ఏకగ్రీవమైన 13 జీపీలకు రూ.1.95 కోట్లను ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. గతంలో రూ.7 లక్షలున్న ప్రోత్సాహకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 ఎన్నికల సందర్భంగా రూ. 10 లక్షలకు పెంచింది. దీనికి అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి కూడా రూ. 5 లక్షలను కలిపి మొత్తం రూ. 15 లక్షలు ఇస్తామని ప్రకటించింది. కానీ ఎన్నికలు జరిగి నాలుగేండ్లు గడుస్తున్నా నిధులు మంజూరు కాలేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు అందించాల్సిన ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేసి అభివృద్ధి కోసం అప్పులపాలైన తమను ఆదుకోవాలని సర్పంచులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


నిధులిస్తే మరింత అభివృద్ధి..



గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రత్యేక ప్రోత్సాహక నిధుల కోసం గ్రామస్తులమంతా ఏకమై పంచాయతీని ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేసుకున్నాం. కానీ గ్రామంలో అదనంగా పలు అభివృద్ధి పనులను చేపడుదామంటే ప్రోత్సాహక నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. దీనివల్ల గ్రామ పంచాయతీ లోని ప్రజల నుంచి నిత్యం ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– స్వాతి, సర్పంచ్, పుటాన్‌దొడ్డి


నిధుల కోసం ఎదురుచూస్తున్నాం



గ్రామ అభివృద్ధి కోసం కోసం గ్రామస్తుల సహకారంతో మా పంచాయతీని ఏకగ్రీవంగా చేసుకున్నాం. పంచాయతీకి ప్రోత్సాహక నిధుల కింద ప్రభుత్వం అందించే రూ. 15 లక్షల నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలు చేపడతాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులను మంజూరు చేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి.

– నాగేశ్వరి, సర్పంచ్, తిమ్మాపురం

ప్రభుత్వానికి నివేదించాం..



మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మూడు పంచాయతీల వివరాలను గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు ఆయా పంచాయతీలకు మంజూరు కావల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు సమాచారం అందించి ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేయిస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల